సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



నకిలీ టీఆర్‌లతో దందా
నెల్లిపాక సీసీఐ కేంద్రంలో వ్యాపారులు నకిలీ టీఆర్‌లతో యథేచ్ఛగా దందా సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 8లో



..పోటెత్తిన భక్తజనం
ఆళ్లపల్లి మండలం పెద్దూరులో కొమరం వంశీయులు ఇలవేల్పు రెక్కల రామక్క జాతర అంగరంగ వైభవంగా సాగుతోంది. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
36° / 20°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వం, రామయ్య నిత్య కల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలుచేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిత్యాన్నదానానికి విరాళాలు
శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి గురువారం పలువురు భక్తులు విరాళాలు అందచేశారు. ముదిగొండ మండలం వనంవారి కిష్టాపురం వాసి తుపాకుల ఎలగొండ స్వామి – రమాదేవి దంపతులు రూ.లక్ష, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడ వాస్తవ్యులు పీ.వీ.కృష్ణమూర్తి – జ్ఞానద దంపతులు రూ.1,00,116 అందజేయగా, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, కత్తి శ్రీనివాసులుతో దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన


అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నివేదన, హారతి, మంత్రపుష్పం సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ పాల్గొన్నారు

26న రుద్రహోమం..
పెద్దమ్మతల్లి ఆలయంలో ఈనెల 26న రుద్ర హోమం నిర్వహించనున్నట్లు ఈఓ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాగశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు జరిగే ఈ హోమంలో పాల్గొన దలిచిన వారు రూ.1,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6303408458 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా కార్యాచరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): వేసవిలో డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ అందించేలా కార్యాచరణ చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ ఎస్‌ఈ జి.మహేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీన సర్కిల్ పరిధిలో గరిష్టంగా విద్యుత్ డిమాండ్ 283.7 మెగావాట్లు నమోదైందని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో కూడా డిమాండ్ పెరిగే అవకాశం ఉందని, ఈ మేరకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశామని పేర్కొన్నారు. లోడ్ పెరిగే ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించడంతో పాటు కొత్తగా 120 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, 50 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచామని వివరించారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో కొత్తగా ఐదు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, నాలుగింటి సామర్థ్యం పెంచామని తెలిపారు. వినియోగదారులకు ప్రత్యామ్నాయ లైన్ (ఇంటర్ లింకు లైన్) ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు కొత్తగా రెండు ఇంటర్ లింకింగ్ లైన్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అవసరం మేరకు కొత్త ఫీడర్లను కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. వేసవికాలంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తామని స్పష్టం చేశారు.

గిరిజన అభివృద్ధి.. కొరవడిన చిత్తశుద్ధి


భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం

ఏడాది దాటినా నిర్వహించని ఐటీడీఏ సమావేశం
- సమస్యలపై పట్టింపులేని ప్రభుత్వం, అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘాలు

భద్రాచలం: గిరిజనుల సమస్యలపై చర్చించి, పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమానికి చేపట్టాల్సిన ప్రణాళికలు రూపొందించేందుకు ప్రతీ మూడు నెలలకోసారి ఐటీడీఏ పాలక మండలి సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఏడాది దాటినా ఈ విషయాన్ని అటు ప్రభుత్వం, ఇటు ఐటీడీఏ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందనే ప్రచారంతో సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారనేది తెలియదు.

గిరిజనులపై శీతకన్ను..
గిరిజనులను అభివృద్ధి చేసేందుకే ప్రభుత్వం ఐటీడీఏలను ఏర్పాటుచేసింది. అధికారులు, ఐటీడీఏ పరిధిలోని ప్రజాప్రతినిధులు ప్రతీ మూడు నెలలకు ఒకసారి సమావేశమై గిరిజనుల సంక్షేమానికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించాలి. కానీ గతేడాది ఫిబ్రవరి 18న సమావేశం నిర్వహించగా, మళ్లీ ఇప్పటివరకు అతీగతీ లేదు. అంతకుముందు సమావేశం 2022 జూలైలో నిర్వహించారు. అంటే 19 నెలల తర్వాత గత ఫిబ్రవరిలో మళ్లీ సమావేశం నిర్వహించారు. దానికి ముందు పరిస్థితి మరీ దారుణం. 2019 ఆగస్టు నుంచి 2022 జూలై వరకు 35 నెలల పాటు అసలు సమావేశమే కాకపోవడం గమనార్హం. ఇలా నెలలు, ఏళ్ల తరబడి జాప్యం చేయడమంటే తమపై ప్రభుత్వం, అధికారులు శీతకన్ను వేయడమేనని గిరిజన సంఘాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. మరి కొద్ది రోజుల్లో గ్రామపంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే సమావేశం నిర్వహించి ఏడాది దాటిందని, ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తి కావాలంటే మరెంత కాలం పడుతుందోనని గిరిజనులు ఎదురుచూస్తున్నారు.

గత సమావేశంలో చర్చ సున్నా..
గిరిజన సమస్యలపై చర్చించాల్సిన సమావేశాలు అధికారుల ప్రగతి నివేదికలకు, ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పుకునేందుకే సరిపోతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. గతేడాది ఫిబ్రవరి 18న జరిగిన పాలకమండలి సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. వీరు రాష్ట్ర కేబినెట్‌లో కీలక పాత్ర పోషిస్తున్నా.. ఇక్కడ మాత్రం గిరిజన సమస్యలపై సరైన చర్చ జరగలేదు. కేవలం వారికి అందిస్తున్న పథకాల గురించే మాట్లాడారని, అధికారులు సైతం ప్రగతి నివేదికలకే పరిమితమయ్యారని గిరిజనులు వాపోయారు.

గిరిజనుల భాగస్వామ్యమేది..?
ఐటీడీఏ పాలక మండలి సమావేశంలో తమకూ మాట్లాడే అవకాశం ఇవ్వాలని గిరిజనులు, ఆయా సంఘాల నాయకులు కోరుతున్నారు. జిల్లాలో కోయ, లంబాడీ, కొండరెడ్డి, నాయకపోడు తదితర జాతుల గిరిజనులు ఎక్కువగా ఉన్నారు. వీరి తరఫున పలువురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గిరిజనుల సమస్యలు, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణపై వారికి సంపూర్ణ అవగాహన ఉంది. కానీ ఐటీడీఏ సమావేశంలో వీరి భాగస్వామ్యం అంతంతమాత్రమే. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు గత సమావేశ సమయంలో బీఆర్‌ఎస్‌లో ఉన్నారు. దీంతో వేదికపై ఆయనకు స్థానం దక్కలేదు. ప్రస్తుతం అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నారు. ప్రముఖ వైద్యుడిగా, ఆదివాసీ ఎమ్మెల్యేగా ఆయనకు ఈ ప్రాంత గిరిజనుల సమస్యలు బాగా తెలుసు. అలాంటి వారికి పాలక మండలిలో కీలక పాత్ర పోషించే అవకాశం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

సకాలంలో సమావేశాలు నిర్వహించాలి



ఐటీడీఏ పాలకమండలి సమావేశాలు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలి. కానీ ఏడాది దాటినా ఆ ఊసే లేదంటే గిరిజనులపై ప్రభుత్వానికి, అధికారులకు ఏ మేరకు చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు. సమావేశం పెట్టినా మాకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు. ఇప్పటికైనా స్పందించి వీలైనంత తొందరగా సమావేశం నిర్వహించడంతో పాటు గిరిజన సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి. – ముర్ల రమేష్, కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు

రోడ్డు ప్రమాదాలను నివారించండి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో మోటారు వాహనాల వినియోగం పెరుగుతుండగా ప్రమాదాలు సైతం అధికమవుతున్నాయని చెప్పారు. వాహనాలు కండిషన్‌గా లేకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ట్రాఫిక్ సిగ్నళ్లు పాటించక పోవడమే ఇందుకు కారణమని అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించేందుకు పోలీసులు, ఆర్‌అండ్‌బీ, వైద్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. జాతీయ రహదారిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని రవాణా శాఖాధికారులను ఆదేశించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి
మార్చి 5న ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. విద్యార్థులు కేంద్రాల వద్దకు సకాలంలో చేరుకునేలా బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద ప్రాథమిక చికిత్స కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులతో పాటు ఒక ఏఎన్‌ఎంను అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఈఓ వెంకటేశ్వరాచారి, డీఐఈఓ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, టేకులపల్లి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సులోచనారాణి, కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ మున్సిపల్ కమిషనర్లు శేషాంజన్‌స్వామి, శ్రీకాంత్, సుజాత పాల్గొన్నారు.

పలుగు, పార పట్టి.. మట్టి తట్ట ఎత్తి..
ఉపాధి కూలీలతో మమేకమైన కలెక్టర్


టేకులపల్లి మండలం సులానగర్‌లో మట్టి తవ్వుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

టేకులపల్లి: మండలంలోని సులానగర్, చింతలంక, కోయగూడెం, చంద్రుతండా, కొత్త తండా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ, ఫారం పాండ్ పనులను కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం పరిశీలించారు. సులానగర్ గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడి పని ప్రదేశంలో తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారా.. కూలి గిట్టుబాటు అవుతోందా అని ఆరా తీశారు. అనంతరం వారితో మమేకమై పలుగు, పార పట్టి మట్టి తవ్వారు. తట్టలో ఎత్తుతూ కూలీల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కోయగూడెంలో రైతు పకీర్ సాగు చేస్తున్న మునగ, చంద్రుతండాలో మరో రైతు ధర్మా సాగు చేస్తున్న ఆయిల్‌పామ్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మునగ కాయలతో పాటు ఆకును పొడి చేసి అమ్మొచ్చని, లాభదాయకమైన ఈ పంట పండించి ఆర్థికాభివృద్ధి చెందాలని సూచించారు. ఆయన వెంట డీఎల్‌పీఓ రమణ, మిషన్ భగీరథ డీఈ పద్మావతి, విద్యుత్ శాఖ డీఈ రంగస్వామి, ఎంపీడీఓ రవీందర్ రావు, ఎంపీఓ గాంధీ, ఏపీఓ కాళంగి శ్రీనివాస్ ఉన్నారు.

‘వీకే -7’ కు త్వరలో అనుమతులు

- బొగ్గు ఉత్పత్తి సాధనకు ఐక్యంగా కృషి చేయాలి
- సంస్థ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పని చేస్తా
- సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని వీకే –7 బొగ్గు గనికి మార్చి రెండో వారంలో పర్యావరణ అనుమతులు వస్తాయని, ఆ వెంటనే ఓబీ పనులు ప్రారంభిస్తామని సింగరేణి డైరెక్టర్(పీపీ) కె.వెంకటేశ్వర్లు తెలిపారు. డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం ఆయన కొత్తగూడెంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సంస్థ నిలదొక్కుకోవాలంటే ఇతర దేశాల వలె తక్కువ ధరకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాల్సి ఉందని, అందుకోసం ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాలని సూచించారు. సంస్థ బీఐఎఫ్‌ఆర్‌లోకి వెళ్లినప్పుడు నాటి కార్మికులు కష్టపడి పనిచేసి తిరిగి నిలబెట్టారని, ప్రస్తుత కార్మికులో ఆ పటిమ లేదని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడం లక్ష్యం కాగా, కొంత వెనుకంజలో ఉన్నామని, మిగిలిన 40 రోజుల్లో లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంస్థ అభివృద్ధి, వ్యాపార విస్తరణ కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. వీకే–7తో పాటు జేకే ఓసీ, గోలేటి, రొంపేడు ఓసీల అనుమతుల సాధనే లక్ష్యంగా పని చేస్తానన్నారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ, కంపెనీని ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని కార్మికులు, ఉద్యోగులకు సూచించారు.

‘ఉపాధి’ని సద్వినియోగం చేసుకోవాలి

డీఆర్‌డీఓ విద్యాచందన

చుంచుపల్లి: జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరు వేసవి కాలంలో ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన అన్నారు. మండలంలోని నందతండాలో గురువారం ఆమె ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ.. నాలుగు నెలల పాటు గ్రామాల్లో ఈజీఎస్ పనులు ఎక్కువగా జరుగుతాయని, ప్రతి కూలీకి చేతినిండా పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. కూలీల హాజరు, కొలతలు వంటివి కచ్చితంగా పాటించాలన్నారు. ఎండలు పెరుగుతున్నందున పని ప్రదేశంలో నీడ, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఆమె వెంట ఎంపీడీఓ సుభాషిని, టీఏ నాగరాజు తదితరులు ఉన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న విద్యాచందన

పనులు వేగవంతం చేయాలి

- రైల్వే అధికారులకు ఏడీఎం గోపాలకృష్ణయ్య సూచన
- పలు అభివృద్ధి పనుల తనిఖీ

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్, ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను సౌత్ సెంట్రల్ రైల్వే అడిషనల్ డివిజనల్ మేనేజర్ గోపాలకృష్ణయ్య గురువారం తనిఖీ చేశారు. పనులకు సంబంధించి స్థానిక అధికారులకు కొన్ని సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అన్నారు. స్టేషన్‌లో తనిఖీ అనంతరం ఏడీఎంతో పాటు సెంట్రల్ రైల్వే డీఆర్‌యూసీసీ మెంబర్ వై.శ్రీనివాస్‌రెడ్డిని పట్టణానికి చెందిన పలువురు కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. బెళగావి ఎక్స్‌ప్రెస్‌తో పాటు కొత్తగూడెం నుంచి డోర్నకల్ వెళ్లే ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలని, కొత్తగూడెం కేంద్రంగా రైల్వే జంక్షన్ ఏర్పాటు చేయాలని కోరారు. పుణ్యక్షేత్రాలైన తిరుపతి, షిరిడీ, భద్రాచలం ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడపాలని, కొత్తగూడెం – సికింద్రాబాద్ కాకతీయ ఎక్స్‌ప్రెస్‌లో జనరల్ బోగీలతో పాటు రిజర్వేషన్ బోగీలు ఏర్పాటు చేయాలని కోరారు. రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్న రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు.

‘పీఎం శ్రీ’ స్కూళ్లకు కంప్యూటర్లు

- భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లోని 46 పాఠశాలలకు మంజూరు
- ఉమ్మడి జిల్లాలో ఏడు ఎమ్మార్సీలకు కూడా..

పాల్వంచరూరల్: పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక విద్య అందనుంది. ఇందుకోసం కంప్యూటర్లను కేటాయించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 46 స్కూళ్లకు డెస్క్ టాప్ కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్‌లు మంజూరయ్యాయి. అలాగే, రెండు జిల్లాల్లో ఏడు ఎమ్మార్సీలకు సైతం కంప్యూటర్లు కేటాయించారు. వీటితో విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్య అందుతుందని అధికారులు భావిస్తున్నారు. కాగా, గతంలోనూ పాఠశాలలకు కంప్యూటర్లు కేటాయించినా శిక్షకులను నియమించకపోవడంతో అవి అటకెక్కాయి. ప్రస్తుతం కూడా బోధకులను కేటాయించకపోతే అదే పరిస్థితి ఎదురవుతుందని పలువురు చెబుతున్నారు.


పాఠశాలకు కేటాయించిన కంప్యూటర్లు

పాఠశాలల వివరాలిలా..
పీఎంశ్రీ పథకం ద్వారా ఇల్లెందు మండలంలోని సుదిమళ్ల బాలికల టీడబ్ల్యూఆర్‌ఈఐఎస్‌కు పది కంప్యూటర్లు, ఒక ప్రింటర్, రెండు యూపీఎస్‌లు కేటాయించారు. అలాగే, టేకులపల్లి మండలం కోయగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, జూలూరుపాడు మండలం పాపకొల్లులోని జెడ్పీహెచ్‌ఎస్, అన్నపురెడ్డిపల్లిలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, చుంచుపల్లి మండలం బాబుక్యాంప్‌లోని హైస్కూల్, కొత్తగూడెం కూలీలైన్ హైస్కూల్, లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం జెడ్పీహెచ్‌ఎస్, పాల్వంచలోని బాలుర టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, బాలికల జెడ్పీహెచ్‌ఎస్, బూర్గంపాడు మండలం సారపాకలోని జెడ్పీహెచ్‌ఎస్, భద్రాచలంలోని కొత్రాజులగుట్ట జెడ్పీహెచ్‌ఎస్, ములకలపల్లిలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, దమ్మపేటలోని టీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, పినపాక మండలం అల్లిరెడ్డిపల్లిలోని ఆశ్రమ పాఠశాల, దుమ్ముగూడెం మండలం రేగుబల్లిలోని బాలికల ఆశ్రమ పాఠశాలకు కంప్యూటర్లు, ఇతర సామగ్రి మంజూరయ్యాయి. అలాగే, అశ్వాపురం జెడ్పీహెచ్‌ఎస్, మణుగూరులోని బాలికల టీటీడబ్ల్యుయూఆర్‌జేసీ, గుండాల మండలంలోని టీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, సుజాతనగర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్, దమ్మపేటలోని జెడ్పీహెచ్‌ఎస్, దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలకు కూడా కేటాయించారు. వీటితో పాటు ఖమ్మం జిల్లాలోని 25 స్కూళ్లకు కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్‌లు మంజూరయ్యాయి. ఇవి ప్రస్తుతం మండల వనరుల కేంద్రాలకు చేరగా, అక్కడి నుంచి పాఠశాలలకు చేరవేస్తారు. ఇక జిల్లాలోని అళ్లపల్లి, అన్నపురెడ్డిపల్లి, కరకగూడెం, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, చుంచుపల్లితో పాటు ఖమ్మం జిల్లాలో ఒక ఎమ్మార్సీకి సైతం ఆరేసి కంప్యూటర్లు, ఒక ప్రింటర్, ఒక యూపీఎస్ మంజూరయ్యాయి.

హరితదళంతో చైతన్యపర్చాలి

డీఎస్‌ఓ చలపతిరాజు

మణుగూరు రూరల్ : హరితదళాలతో గ్రామాలను చైతన్యపర్చాలి జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు అన్నారు. మండల పరిధిలోని సాంబాయిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నేచర్ క్యాంప్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు పేరంటాల చెరువు, బుగ్గ, బీటీపీఎస్, రామానుజవరం వద్ద గోదావరి నదీ పరివాహకం తదితర ప్రాంతాలను చూపించడంతో పాటు వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం డీఎస్‌ఓ మాట్లాడుతూ.. ప్రకృతి ఉగ్రరూపాన్ని ప్రపంచంలో ఎవరూ తట్టుకోలేరనడానికి అమెరికా, ఫ్రాన్స్ దేశాలే నిదర్శనమని అన్నారు. అనంతరం స్థానిక పీవీ కాలనీలోని సింగరేణి పాఠశాలను చలపతిరాజు పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్‌జీఓ రీసోర్స్ పర్సన్ రాజశేఖర్, పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీలత, గైడ్ టీచర్ బి.కోటేశ్వరరావు, బి. రామిరెడ్డి, రాము, కె రామారావు, కోటేశ్వరరావు, పరమయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చలపతిరాజు

చిన్నారులకు సౌకర్యాలు కల్పించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

భద్రాచలంటౌన్: శిశు గృహలోని చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. భద్రాచలంలోని శిశుగృహను గురువారం ఆమె సందర్శించారు. చిన్నారులకు అందుతున్న సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్పెషల్ సబ్ జైల్‌ను పరిశీలించి ఖైదీలకు ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. జైలు జీవితం గడిపిన ప్రతీ ఒక్కరు పూర్తి పరివర్తన చెందాలని, విడుదలయ్యాక ప్రశాంత జీవితం గడపాలని సూచించారు. ఆ తర్వాత సరోజిని వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.


వృద్ధాశ్రమంలో మాట్లాడుతున్న భానుమతి

8న లోక్ అదాలత్..
మార్చి 8వ తేదీన నిర్వహించే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ పడేలా చూడాలని భానుమతి సూచించారు. భద్రాచలం జ్యుడీషియల్ కోర్టు పరిధిలోని పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, న్యాయవాదులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు.

అపార్ ఐడీ ప్రక్రియ పూర్తి చేయాలి

అశ్వారావుపేటరూరల్: విద్యార్థుల అపార్ ఐడీ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ అన్నారు. జిల్లా అధికారుల బృందం గురువారం అశ్వారావుపేట, తిరుమలకుంట కాలనీ, మామిళ్లవారిగూడెం పాఠశాలలను సందర్శించి, ఆయా పాఠశాలల్లో అపార్ ఐడీ నమోదు వివరాలను పరిశీలించింది. అనంతరం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సతీష్ మాట్లాడుతూ.. అపార్ ఐడీ నమోదును వేగవంతం చేయాలన్నారు. నమోదుపై సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం నారాయణపురం కాంప్లెక్స్‌లో జరిగిన బాలమేళా కార్యక్రమంలో పాల్గొని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమాల్లో జిల్లా బృందం సభ్యులు నాగరాజశేఖర్, సైదులు, ఎంఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు సాధించిన విద్యార్థులతో అధికారులు

క్లుప్తంగా

కుటీర పరిశ్రమలతో స్వయం ఉపాధి



సబ్సిడీ చెక్కు అందచేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన నిరుద్యోగ యువత కుటీర పరిశ్రమలు ఏర్పాటుచేసుకుని స్వయం ఉపాధి పొందడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. ఆళ్లపల్లి మండలానికి చెందిన నలుగురు రూ.25లక్షల విలువైన శ్రీ ధనలక్ష్మి ఫ్లైయాష్ బ్రిక్స్ యూనిట్‌ను ఏర్పాటుచేసుకోగా రూ.15లక్షల సబ్సిడీ మంజూరైంది. ఈ మేరకు సభ్యులకు సబ్సిడీ చెక్కును గురువారం ఆయన భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఇటుకలు తయారీ, ముడి సరుకుల సేకరణ, మార్కెటింగ్‌పై అరా తీశాక మాట్లాడారు. నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నిస్తూనే సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటే స్వయం ఉపాధి లభించడమే కాక ఇంకొందరికి చేయూతనివ్వవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, జేడీఎం హరికృష్ణ, యూనిట్ సభ్యులు సుశీల, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పరిశ్రమల్లో రాణింపు



శిక్షణ పొందిన యువతతో సీఐటీడీ డైరెక్టర్, తదితరులు

భద్రాచలం: యువతీ, యువకులు సూక్ష్మ పరిశ్రమలను ఏర్పాటుచేసుకుని సమష్టిగా కృషి చేస్తే విజయం సొంతమై జీవితంలో రాణించవచ్చని సీఐటీడీ డైరెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. భద్రాచలంలోని వైటీసీలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్స్ డిజైన్ ఆధ్వర్యాన ఎంఎస్ఎంఈ యూనిట్ల సభ్యులకు ఇస్తున్న మూడు రోజుల శిక్షణ గురువారం ముగిసింది. ఈసందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఎంచుకున్న రంగంపై పూర్తి అధ్యయనం చేశాక పరిశ్రమలు ఏర్పాటుచేయాలని, నాణ్యమైన వస్తువుల తయారీతో పాటుగా మార్కెటింగ్‌పై పట్టు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, సీఐటీడీ శిక్షకుడు విజయ్‌కుమార్, భవిత సెల్ సిబ్బంది మణికుమారి, సమ్మయ్య, దినేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



క్యారంబోర్డు ఆడుతున్న బోధన సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ కళాశాలలో విశ్వవిద్యాలయ స్థాయిలో బోధన సిబ్బందికి నిర్వహిస్తున్న క్రీడా పోటీలు గురువారం ఉత్సాహంగా సాగాయి. రాష్ట్రంలోని 9 వ్యవసాయ కళాశాలల నుంచి బోధన సిబ్బంది పోటీలకు హాజరయ్యారు. గురువారం రెండో రోజు వాలీబాల్, చెస్, బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, షటిల్, క్యారంబోర్డు, క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలను కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, ప్రొఫెసర్లు డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ శిరీష, డాక్టర్ మధుసూదన్‌రావు పర్యవేక్షించారు.


నేడు ఉమ్మడి జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీలు

కొత్తగూడెంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు శుక్రవారం కొత్తగూడెం రామవరంలోని తెలంగాణ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కాశీహుస్సేన్ తెలిపారు. అండర్–10, 12, 14, 17 విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో రావాలని సూచించారు.

ఖమ్మం, కల్లూరు, మణుగూరు జట్ల విజయం

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో కొనసాగుతున్న రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ టోర్నీలో భాగంగా గురువారం నిర్వహించిన మ్యాచ్‌ల్లో ఖమ్మంఅర్బన్, కల్లూరు, మణుగూరు జట్లు ముందంజలో నిలిచాయి. ఖమ్మం అర్బన్ – వైరా జట్ల నడుమ మ్యాచ్‌లో అర్బన్ జట్టు నిర్ణీత ఓవర్లలో 112 పరుగులు చేయగా తర్వాత బ్యాటింగ్‌కు దిగిన వైరా 107 పరుగులే చేయడంతో ఓటమిపాలైంది.కల్లూరు–ముదిగొండ మధ్య మ్యాచ్‌లో ముదిగొండ జట్టు 77పరుగులు చేయగా, కల్లూరు జట్టు ఆరు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే, మూడో మ్యాచ్‌లో మణుగూరు–సత్తుపల్లి తలపడగా తొలుత బ్యాటింగ్‌కు దిగిన మణుగూరు జట్టు 113 పరుగులకు ఆలౌట్ అయింది. ఆతర్వాత సత్తుపల్లి 106 పరుగులకే ఆలౌట్ కావడంతో మణుగూరుకు విజయం దక్కింది. ఈమేరకు పోటీలను టోర్నీ ఆర్గనైజర్ ఎం.డీ.మతిన్ పర్యవేక్షించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

నకిలీ టీఆర్‌లతో దందా



నెల్లిపాక సీసీఐ కేంద్రంలో పత్తి కొనుగోళ్లు(ఫైల్)

- నెల్లిపాక సీసీఐ కేంద్రంగా రైతుల పేరుతో వ్యాపారుల పత్తి అమ్మకాలు
- ఇటీవల భద్రాచలం మార్కెట్ కమిటీ కార్యదర్శి సస్పెన్షన్
- తాజాగా లంచం డిమాండ్ చేసి ఏసీబీకి చిక్కిన అశ్వాపురం ఏఓ

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాకలో సీసీఐ కొనుగోళ్లలో నకిలీ టీఆర్ లతో వ్యాపారులు రైతుల పేర్లతో భారీగా పత్తి అమ్మకాలు సాగించారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి నకిలీ టీఆర్‌లతో సీసీఐలో అమ్మకాలు జరిపి భారీగా సొమ్ము చేసుకున్నారు. నెల్లిపాక సీసీఐ కేంద్రంగా సాగిన ఈ దందా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లోని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో నకిలీ టీఆర్‌ల వ్యవహారం ఇటీవల విజిలెన్స్ విచారణలో వెలుగుచూసింది. విజిలెన్స్ అధికారులు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా విచారణకు ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నకిలీ టీఆర్‌లను గుర్తించారు. వీటి మంజూరుకు అశ్వాపురం మండలంలో పని చేస్తున్న ఏఈఓ ప్రధాన సూత్రదారిగా, కమీషన్ల కోసం నకిలీ జిరాక్స్‌లతో వ్యాపారులకు ఇష్టానుసారంగా నకిలీ టీఆర్‌లు ఇచ్చారని నిర్ధారించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. త్వరలోనే ఏఈఓపై సస్పెన్షన్ వేటు పడుతుందని భావించారు. ఈ వ్యవహారంలో భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావుపై సస్పెన్షన్ వేటు వేశారు. తాజాగా టీఆర్ కోసం ఓ రైతు వద్ద రూ.30 వేలు లంచం తీసుకుంటూ అశ్వాపురం మండల వ్యవసాయ అధికారి సాయిశంతన్‌కుమార్ గురువారంఏసీబీ అధికారులకు పట్టుపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నెల్లిపాక సీసీఐ కేంద్రంలో నకిలీ టీఆర్‌లపై పూర్తి స్థాయిలో ఏసీబీ అధికారులతో విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

ఏసీబీకి చిక్కిన ఏఓ..

రైతు వద్ద రూ.30 వేలు తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి



ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ ఏఓ సాయి శంతన్‌కుమార్

అశ్వాపురం: పత్తి విక్రయించేందుకు టీఆర్ కోసం వచ్చిన రైతు నుంచి లంచం తీసుకుంటుండగా మండల వ్యవసాయ అధికారి సాయిశంతన్‌కుమార్‌ను గురువారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ కథనం ప్రకారం .. మండలానికి చెందిన ఓ రైతు పత్తి అమ్మేందుకు టీఆర్ కోసం ఏఓ వద్దకు వెళ్లగా రూ.30 వేలు డిమాండ్ చేశాడు. దీంతో రైతు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనల ప్రకారం రైతు వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లి, ఏఓ సూచనల మేరకు డబ్బులు బ్యాగ్‌లో పెట్టాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు వచ్చి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏఓను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మండల వ్యవసాయ అధికారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించనున్నట్టు డీఎస్పీ తెలిపారు. కాగా ఫిర్యాదుదారుడి పేరు ఏసీబీ అధికారులు వెల్లడించలేదు. ఎవరైనా లంచాలు అడిగితే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ వై.రమేష్, సీఐలు శేఖర్, సట్ల రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఓపై కుట్ర చేశారని ఆరోపణలు

ఏఓపై కుట్ర పన్నారని సామాజిక మాధ్యమాల్లో కొందరు పోస్టులు పెట్టడం గమనార్హం. సీసీఐ కేంద్రంగా జరిగిన నకిలీ టీఆర్‌ల దందాకు సహకరించలేదని కుట్ర పన్ని ఏసీబీ అధికారులకు పట్టించారని, దీనిపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని రాజకీయపార్టీల నాయకులు, రైతులు, స్థానికులు కోరుతున్నారు.



పాండవుల గుట్ట నుంచి తరలివస్తున్న వనదేవతకు ఎదుర్కోలు నిర్వహిస్తున్న గిరిజనులు

వనం రాకతో పోటెత్తిన భక్తజనం

- ఘనంగా సాగుతున్న రెక్కల రామక్క జాతర
- జాతరలో పాల్గొన్న ముగ్గురు ఎమ్మెల్యేలు



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు పాయం, కోరం, తెల్లం

గుండాల: కొమరం వంశీయులు ఇలవేల్పు రెక్కల రామక్క జాతర అంగరంగ వైభవంగా సాగుతోంది. గురువారం 'వనం'(దేవత) రాకతో భక్తులు పోటెత్తారు. ఆళ్లపల్లి మండలం పెద్దూరు గ్రామంలో కొమరం వంశీయుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జాతర గిరిజన ఆచార సంప్రదాయాల ప్రకారం నిర్వహిస్తున్నారు. మంగళవారం కర్ర దించుట, దేవతకు కుంకుమ పూజతో పాటు, గుడి మేలుకొలుపు జరిపారు. బుధవారం ఒక్కపొద్దుల రెక్కల రామక్క దేవతను గుట్ట నుంచి గర్భగుడికి తీసుకొచ్చారు. గురువారం పాండవుల గుట్ట నుంచి వనదేవతను డప్పువాయిద్యాలతో, గిరిజన నృత్యాలతో తీసుకొచ్చారు. మార్గమధ్యలో ఎదుర్కోలు నిర్వహించారు. రాత్రి దేవతలకు గంగాస్నానం చేయించారు. అనంతరం గద్దెలపై ప్రతిష్ఠించి కల్యాణం జరిపించారు. దీంతో నిండు జాతర మొదలైంది. పూజారులు కొమరం కనకయ్య, సీతయ్య లాలయ్య, రఘుబాబు, రవి, అర్తిబిడ్డ కత్తుల సతీష్, వడ్డె ఈసం రామయ్య ప్రత్యేక పూజలు చేశారు. వనం తరలివచ్చే క్రమంలో భక్తులు పూనకాలతో ఊగిపోయారు. కొమ్ము నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చుట్టు పక్క మండలాలతోపాటు ఇతర జిల్లాల నుంచీ భక్తులు తరలివచ్చారు. శుక్రవారం మొక్కుల చెల్లింపు ఉంటుందని, శనివారం తిరిగి దేవతను గుట్టకు చేర్చుతామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యేలు

పెద్దూరులో జరుగుతున్న కొమరం వంశీయుల ఇలవేల్పు రెక్కల రామక్క దేవతను గురువారం ఇల్లెందు, పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గుట్ట నుంచి వనం తీసుకొస్తుండగా ఎమ్మెల్యేలు డోలీ చప్పుళ్లతో చిందు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొమరం హన్మంతు, మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, కొమరం వెంకన్న, రాంబాబు, సతీష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ సర్వే పాయింట్ల గుర్తింపు



సర్వే పాయింట్లను పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచ: మున్సిపాలిటీలో జియో మాస్టర్ ప్లాన్ సర్వే పాయింట్లను అధికారులు గుర్తిస్తున్నారు. ఇప్పటివరకు 34 చోట్ల పాయింట్లను ఎంపిక చేశారు. ఈ ప్రక్రియను గురువారం మున్సిపల్ కమిషనర్ కె.సుజాత పరిశీలించి మాట్లాడారు. త్వరలోనే డ్రోన్ కెమెరాల ద్వారా పట్టణ స్థితిగతులను గుర్తిస్తామని తెలిపారు. భవిష్యత్‌లో పట్టణ మాస్టర్ ప్లాన్ తయారు చేసేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కరకవాగు ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించారు. నీటిశుద్ధి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పాత పాల్వంచ చింతల చెర్వు కట్టపై పారిశుద్ధ్య పనులు పరిశీలించి చెరువు పొడువునా వాకర్లకు ఇబ్బందులు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కమిషనర్ వెంట టీపీఓ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

బూర్గంపాడు: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని గురువారం ఉదయం సారపాకలో పట్టుకున్నారు. బూర్గంపాడు ఎస్ఐ రాజేశ్ కథనం ప్రకారం.. అనుమతి పత్రాలు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న లారీని సారపాకలో పోలీసులు పట్టుకున్నారు. లారీ డ్రైవర్ కొనకండ్ల వెంకన్నను అదుపులోకి తీసుకుని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీ యజమాని రామకృష్ణపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం

అశ్వారావుపేటరూరల్: ఓ చిన్నారి మృతిపై ఆలస్యంగా అనుమానాస్పద మృతిగా ఫిర్యాదు రాగా, ఖననం చేసిన మృతదేహాన్ని గురువారం వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై టీ యయాతి రాజు కథనం ప్రకారం.. మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన నారదాసు రామకృష్ణ, వరలక్ష్మి దంపతులకు నాలుగు నెలల చిన్నారి ఉంది. పాపకు ఈ నెల 5న అశ్వారావుపేటలోని సబ్ సెంటర్‌లో టీకా వేయించగా, 6న మధ్యాహ్నం మృతి చెందింది. అదే రోజు చిన్నారి మృతదేహాన్ని ఖననం చేశారు. బుధవారం రాత్రి తమ కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నట్లు తండ్రి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేయించినట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

అశ్వారావుపేటరూరల్: పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఎస్సై టీ యయాతి రాజు కథనం ప్రకారం.. పట్టణ కేంద్రంలోని గోగులబంధం ప్రాంతంలో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేసి, ముగ్గురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.52 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. దాడి సమయంలో మరో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హాస్టల్ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు

కారేపల్లి: కారేపల్లిలో బీసీ బాలుర వసతి గృహం నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించగా, నిధులు కూడా మంజూరయ్యాయి. అయితే, ఈ స్థలంలో ఏర్పాటుచేసిన బోర్డును కొందరు తొలగించడం, అక్కడ గద్దెల నిర్మించడంతో బీసీ సంక్షేమ శాఖ డివిజనల్ అధికారి ఈదయ్య గురువారం పరిశీలించా రు. స్థల ఆక్రమణకు యత్నిస్తే చర్యలు తీసుకుంటా మని తెలిపారు. ఈవిషయమై తహసీల్దార్ సంపత్‌కుమార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశామని వెల్లడించారు. త్వరలోనే హాస్టల్‌కు కేటాయించిన స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

దమ్మపేట: అతివేగంతో ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి ప్రమాదం జరిగిన ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... గురువారం రాత్రి అన్నపురెడ్డిపల్లి మండలం బుచ్చన్నగూడెం గ్రామానికి చెందిన కొండ్రు రమేష్(27) మందలపల్లి నుంచి సత్తుపల్లి వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గట్టుగూడెం శివారులో బైక్ అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ ద్వారా సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పోలీసుల అదుపులో సిగరెట్ల దొంగలు?

రాజస్థాన్ వ్యక్తులుగా గుర్తింపు

పాల్వంచ: పట్టణంలోని ఐటీసీ డీలర్ గోడౌన్‌లో భారీ మొత్తంలో సిగరెట్లను చోరీ చేసిన ఘటనలో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. ఈ చోరీ చేసింది రాజస్థాన్‌కు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. గత జనవరి 4న రాత్రి టీటీటీ కల్యాణ మండపం రోడ్‌లోని ఐటీసీ డీలర్ స్టాక్ పాయింట్‌లో దొంగలు పడి సుమారు రూ.26 లక్షల విలువైన 24 కాటన్ల సిగరెట్లను అపహరించారు. దీంతో షాపు నిర్వాహకుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు క్లూస్ టీం ద్వారా ఆధారాల సేకరించారు. కాగా చోరీ చేసిన సిగరెట్లలో రూ.6 లక్షల సరుకును మణుగూరులో ఓ షాపులో, మిగతా సరుకు కొంత హైదరాబాద్‌లో విక్రయించినట్లు సమాచారం. ఆ విక్రయాల ఆధారంగా వచ్చిన సమాచారంతో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. గతంలో శాస్త్రీరోడ్‌లో ఓ హోల్ సేల్ షాపులో పనిచేసే రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి గుమస్తాగా కొంత కాలం పనిచేశాడు. అడపాదడపా ఐటీసీ గోదాంలో సరుకు తెచ్చేందుకు వెళ్లే అతను మరికొందరితో కలిసి సిగరెట్లు అపహరించి, రాజస్థాన్‌కు పరారైనట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు రాజస్థాన్ వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరికి పలు చోరీల్లో కూడా హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా నవభారత్ కాలనీలో పలువురు అధికారుల ఇళ్లలో చోరీకి పాల్పడిన వ్యక్తులు మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తులుగా అనుమానిస్తూ పోలీసులు అక్కడికి వెళ్లి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

ముద్దాయికి ఆరు నెలల జైలుశిక్ష



కొత్తగూడెంటౌన్: అదనపు కట్నం తేవాలని వేధిస్తున్న ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి మండలం పట్టాయిగూడేనికి చెందిన గుమలాపురం సురేష్‌కు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ గురువారం కొత్తగూడెం రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు ఇలా... కొత్తగూడెం కూలీలైన్‌కు చెందిన శారదకు పట్టాయిగూడెం గ్రామానికి చెందిన గుమలాపురం సురేష్‌తో వివాహం జరగ్గా, రెండు లక్షల నగదు, ఇంటి స్థలం, బంగారం వరకట్నంగా అందజేశారు. కొంతకాలంపాటు కాపురం సవ్యంగా సాగగా కుమారుడు జన్మించాడు. ఆ తర్వాత సురేష్ నిత్యం మద్యం తాగి కొడుతూ అదనంగా మరో రూ.2లక్షల కట్నం కావాలని వేధిస్తున్నాడు. వేధింపులు భరించలేక పుట్టింటికి వచ్చిన శారద భర్త, అతని తండ్రి తండ్రి కృష్ణపై ఫిర్యాదు చేయగా త్రీటౌన్ పోలీసులు వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నలుగురు సాక్షులను విచారించిన జడ్జి సురేష్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కృష్ణపై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టి వేశారు. ఏపీపీఓ విశ్వశాంతి ప్రాసిక్యూషన్ నిర్వహించగా, నోడల్ ఆఫీసర్ జి. ప్రవీణ్‌కుమార్, లైజన్ ఆఫీసర్ ఎస్‌కే అబ్దుల్ ఘని, సిబ్బది బి.శోభన్, బి.రవి సహకరించారు.

హత్యాయత్నం కేసులో నాలుగేళ్లు..

కొత్తగూడెంటౌన్: యువతిపై హత్యాయత్నం కేసులో నిందితుడికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ గురువారం కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బత్తుల రామారావు తీర్పు చెప్పారు. వివరాలు ఇలా.. భద్రాచలం రాజంపేటకు చెందిన పోసారపు జాన్‌రాజు బట్టల షాపు నిర్వహిస్తుండగా గుడిమల్ల జగదీష్ న్యూసెన్స్ చేయడంతో మందలించారు. దీంతో జగదీష్ కక్ష పెంచుకుని జాన్ రాజు పెద్ద కూతురు హిందు వర్షిత గొంతు కోసి గాయపర్చాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఎనిమిది మంది సాక్షులను విచారించాక గుడిమల్ల జగదీష్‌పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. సీఐ బి.రమేష్, సిబ్బంది జి. ప్రవీణ్‌కుమార్, ఎం.శ్రీనివాస్, సుధీర్‌బాబు సహకరించారు.

చెల్లని చెక్కు కేసులో...

భద్రాచలంటౌన్: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తూ భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి శివనాయక్ గురువారం తీర్పు ఇచ్చారు. పట్టణానికి చెందిన రామాలయ ఉద్యోగి శ్రీరంగం నరసింహాచార్యులు చెక్కును హామీగా పెట్టి రాంప్రసాద్ అనే వ్యక్తి నుంచి రూ.2 లక్షలు, పద్మారాణి వద్ద రూ. 2 లక్షలు తీసుకున్నాడు. తీసుకున్న నగదును ఇవ్వకపోవడంతో బాధితులు హామీగా పెట్టిన చెక్కులను బ్యాంకులో వేయగా అవి చెల్లనవిగా తేలింది. బాధితులు కోర్టును ఆశ్రయించగా వాదోపవాదనల అనంతరం న్యాయమూర్తి నిందితునికి ఆరు నెల జైలుతోపాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

మణుగూరు టౌన్: ఓ ఆటో డ్రైవర్ సెల్ఫీ వీడియో తీసి పురుగుల మందు తాగాడు. ఈ సంఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని బాపనకుంటకు చెందిన శివ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో తన భార్యతో మరో వ్యక్తి వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని, వివిధ కారణాలతో తన భార్య దూరంగా ఉంటుందని పేర్కొన్నాడు. పలుమార్లు హెచ్చరించి, ఇద్దరికి దేహశుద్ధి చేసినా మార్పు రావడం లేదంటూ సెల్ఫీ వీడియోలో వివరించాడు. తన చావుకు వారే కారణమంటూ మంగళవారం రాత్రి పురుగుల మందు తాగగా, స్థానికులు గమనించి 100 పడకల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి నుంచి న్యాయమూర్తి వాంగ్మూలం సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అశోక్ (ఫైల్)

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో బుధవారం రాత్రి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని సులానగర్‌కు చెందిన అజ్మీరా శివ కుమారుడు అశోక్ (34) బుధవారం రాత్రి టేకులపల్లి నుంచి సులానగర్ ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో టేకులపల్లి లారీ ఆఫీస్ వద్ద ముందు వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న బైక్ లారీని ఢీకొట్టింది. దీంతో అశోక్‌కు తీవ్రగాయాలయ్యాయి. కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి లక్ష్మి, నాయకుడు కోరం సురేందర్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

బూర్గంపాడు: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన సోందె పోస (20) తల్లిదండ్రులు కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో పోస తీవ్ర మనస్తాపానికి గురికాగా మండలంలోని చెరువు సింగారం గ్రామంలో ఉంటున్న అతని బాబాయి తన వద్దకు తీసుకువచ్చాడు. కొంతకాలంగా కూలిపనులకు వెళ్తున్న పోస తల్లిదండ్రులు లేరనే మనోవేదనతో ఈ నెల 7న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగభిక్షం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దమ్మపేటలో మరొకరు..



నాగేంద్రబాబు (ఫైల్)

దమ్మపేట : రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని గండుగులపల్లి గ్రామంలో బుధవారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని జగ్గారం గ్రామానికి చెందిన మడివి నాగేంద్రబాబు(30), వగ్గెల లక్ష్మణ్, సత్తుపల్లి మండలం చిన్నపాకలగూడేనికి చెందిన కేతేపల్లి జానకీరామ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. నాగేంద్రబాబును వరంగల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అదనపు ఎస్సై బాలస్వామి తెలిపారు.